క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వున్నం నాగమల్లేశ్వరరావు శనివారం చెప్పారు. వున్నం చారిటబుల్ ట్రస్ట్, పిడుగురాళ్ల వున్నం హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. సాధరణ రోగాలతో పాటుగా స్త్రీల సంబంధిత వ్యాధులు, నరాలు, కీళ్లు, మోకాలి నొప్పి వంటి రోగాలకు వైద్య పరీక్షలు చేస్తారని ఆయన వివరించారు.

పుస్తకాల ద్వారా జ్ఞానం పెంపొందించుకోవచ్చు



విద్యార్థులకు కథలు, నవలలు పుస్తకాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

దాచేపల్లి : కథలు, నవలలు ద్వారా విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు కొసూరి రవికుమార్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ మెయిన్ పాఠశాల, ఎస్టీ కాలనీ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రూ.30 వేలు విలువ చేసే కథలు, నవలలు, బొమ్మల పుస్తకాలు, బాలల గేయాల పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ...పుస్తకాల ద్వారా జ్ఞానం పెంపొందించుకోవచ్చునని, అమెరికాలో స్థిరపడిన ప్రవాసాంధ్రులు విద్యార్థుల కోసం పుస్తకాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఏ తాతయ్య, అనిశెట్టి కుమారస్వామి, షేక్ మస్తాన్‌వలి, అనురాధ, మల్లికాతాజ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంటనష్ట పరిహారం అందజేత



రైతులకు చెక్కులు అందజేస్తున్న జాయింట్ ప్రెసిడెంట్ సీతారాములు

దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడు గ్రామ సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ యజమాన్యం రైతులకు పంట నష్ట పరిహారం చెక్కులను శనివారం అందజేశారు. ఫ్యాక్టరీ నుంచి తుమ్మలచెరువు టోల్ ప్లాజవరకు ఫ్యాక్టరీకి చెందిన రోడ్డు ఉంది. ఈ రోడ్డు మీదుగా వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల పంట నష్టం జరిగింది. దీంతో బాధిత రైతులకు రూ 6.65లక్షల చెక్కులను ఫ్యాక్టరీ జాయింట్ ప్రెసిడెంట్ సీహెచ్. సీతారాములు చేతుల మీదుగా అందజేశారు. రైతులకు చెట్టినాడ్ సిమెంట్ యజమాన్యం అండగా ఉంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, సర్పంచ్ బి. కమారి, కె. రంగారెడ్డి, ఫ్యాక్టరీ హెచ్ఆర్ మేనేజర్ షేక్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ జూనియర్ కళాశాలకు సామగ్రి వితరణ



విజయపురిసౌత్: స్థానిక ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 1985–87 బ్యాచ్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల జీఎస్టీ కమిషనర్ రవికిరణ్ ఆధ్వర్యంలో శనివారం మూడు లక్షల 50 వేల రూపాయల విలువ చేసే సామగ్రిని కళాశాల ప్రిన్సిపల్ రంగాచారికి అందజేశారు. వీటిలో 1,80,000విలువ కలిగిన సోలార్ లాంప్‌లు, 50వేలు విలువ కలిన జనరేటర్, కళాశాల వాహన రిపేర్లు, 51వేల రూపాయలు విలువ కలిగిన స్పోర్ట్స్ మెటీరియల్, 31వేల రూపాయల విలువ కలిగిన మ్యూజికల్ బ్యాండ్ సిస్టం, 19,270 రూపాయల విలువ కలిగిన ఎన్ఎస్ఎస్ యూనిట్ పరికరాలతో మొత్తంగా మూడున్నర లక్షల విలువ కలిగిన సామగ్రిని కళాశాలకు అందజేశారు. ఇటీవల కళాశాలను సందర్శించిన పూర్వ విద్యార్థులు కళాశాల అవసరాలను గుర్తించి విద్యార్థులకు చేయూతనివ్వడంపై కళాశాల ప్రిన్సిపల్ రంగాచారి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి రమేష్‌నాయుడు, అధ్యాపకులు హేమాంబర్ రెడ్డి, శరత్‌బాబు, వేణుగోపాల్, సరోజిని,-సుబ్బారెడ్డి, రాజశేఖర్, లింగేశ్వరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): శ్రీసుభద్రా, బలభద్రా సహిత శ్రీజగన్నాథస్వామి 11వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం నిత్యార్చన, బలిహరణ, తీర్థప్రసాదవితరణ నిర్వహించారు. నరసరావుపేట యిన్నలూరి రామబ్రహ్మం హనుమాన్ భక్త బృందంచే 108 సార్లు సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మహిళకు ప్రభుత్వ పథకాల నుంచి పొందిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: రాష్ట్ర ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చే విధంగా పరిపాలన కొనసాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల మైనార్టీ ప్రజల ఆశా జ్యోతి అని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాత్రి అడిగొప్పల గ్రామంలో నాల్గవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలు, మహిళలు, యువకులు ఉత్సాహంగా నాల్గవరోజు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తప్పెట్లు తాళాలుతో బాణాసంచాలు పేలుస్తూ గ్రామంలో ప్రభుత్వ విప్ పీఆర్కేకు బ్రహ్మరథం పట్టారు. పీఆర్కే ఇంటి ఇంటికి వెళ్లి గత మూడున్నరేళ్ళుగా జగనన్న ప్రభుత్వంలో వచ్చిన సంక్షేమ అభివృద్ధి, లబ్ధిని వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది అర్హత ఉన్న రానటువంటి లబ్ధిదారులను ప్రత్యేకంగా స్థానిక సచివాలయ సిబ్బందితో మాట్లాడి నమోదు చేయిస్తూ కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో సాంకేతికపరమైన ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. స్థానిక వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి అర్హత ఉన్న వారికి సంక్షేమ ఫలాలు అందుతున్నట్లయితే వారి వివరాలను తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. 318 మంది లబ్ధిదారులను కలిసి పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజులలో మరింత అభివృద్ధి సంక్షేమం చర్యలు తీసుకుంటామని, స్థానిక ప్రజలు, నాయకులకు తెలిపారు. ప్రతి నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమస్యలను పరిష్కార దిశగా తమ వంతు ప్రయతి్నంచాలన్నారు. తాను నిత్యం అందుబాటులో ఉంటానని స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కారం కానట్లయితే లబ్ధిదారులను తన వద్దకు నేరుగా తీసుకు వచ్చి సమస్యలను పరిష్కరించే విధంగా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, సర్పంచ్ నాలి రామయ్య, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, వైస్ ఎంపీపీలు చల్లా శ్రీనివాసరావు, ఊరబండి ఏగయ్య, నాయకులు నలబోతు వెంకటేశ్వర్లు, ఎంపీటీసి షేక్ హుస్సేన్, పలువురు మండల అధికారులు, మండల పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, కటకం చిన వెంకటయ్య, జంగా యలమంద, సంకురాత్రి సీతయ్య, తోట వాసు, మాజీ జెడ్పిటీసి కొనకంచి బాబు, గర్నె లక్ష్మీనారాయణ, రాాయపాటి నాగేశ్వరరావు, కోట బ్రహ్మం, లక్ష్మారెడ్డి, సంక్రాంతి గురువులు, డా'' వెంకయ్య, గ్రామ సచివాలయ కన్వీనర్లు తాళ్ళ అంబారావు, వేముల సత్యనారాయణ, రాయల మధు బాబు, మల్లెతోట జానీ, చిలకల అంజిరెడ్డి, తలపరపు కోటేశ్వరరావు, జక్కా రమేష్, తోటకూర వెంకటేశ్వర్లు, షేక్ జానీ, మాచర్ల జార్జి, నాగెండ్ల లక్ష్మీనారాయణ, పలువురు గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్ రెడ్డి అన్నారు. మండలంలోని పొందుగల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే కాసు చేపట్టారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే కాసు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ..కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ఆధారంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే అది కూడా టీడీపీ వారైతేనే ప్రభుత్వ పథకాలు వచ్చేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లంచాలు లేని పారదర్శకమైన పాలన అందిస్తూ ప్రజలందరూ నా వాళ్లే అనుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఎక్కడో రాష్ట్ర రాజధానిలో ఉండే సచివాలయం వ్యవస్థను గ్రామంలోకి తెచ్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని, మన చుట్టూ పక్కల నివశిస్తూ నిరుద్యోగులుగా ఉన్న యువతీ, యువకులకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారని ఆయన గుర్తు చేశారు. ఈ రోజు సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఏపీ నంబర్ స్థానంలో ఉందని, సంక్షేమ పాలకుడైన సీఎం జగన్‌ను దేశం ఆదర్శంగా తీసుకుంటుందని ఎమ్మెల్యే కాసు చెప్పారు. శ్రీనివాసపురం అభివృద్ధి నా భుజస్కందాలపై ఉందని, ఈ గ్రామాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. శ్రీనగర్ నుంచి శ్రీనివాసపురం వరకు వచ్చే రోడ్డును త్వరలోనే బాగు చేయిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ బ్రహ్మనాయుడు, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, నాష్ట ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణా, సర్పంచ్ తండా బుడేసా, ఉప సర్పంచ్ షేక్ హిమామ్‌వలి, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, సచివాలయం కన్వీనర్ బొజ్జా వెంకట కృష్ణమూర్తి, నాయకులు జక్కా ఆశోక్‌కుమార్, బొజ్జా నాగేశ్వరరావు, బొజ్జా కాశీరామారావు, జక్కా సైదులు, బొజ్జా వెంకటేశ్వర్లు, జక్కా కొండలు తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన సుబ్బమ్మ



చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన కొప్పుల సుబ్బమ్మను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దాచేపల్లి : నగర పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సుబ్బమ్మ నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, కార్యాలయం సిబ్బంది చైర్‌పర్సన్ సుబ్బమ్మను శాలువా, పూలదండలతో సన్మానించి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రోత్సాహంతో తనకు చైర్‌పర్సన్ పదవి దక్కిందని, ఎమ్మెల్యే కాసు, కౌన్సిల్ సభ్యుల సహకారంతో నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పారు. నగర పంచాయతీలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు శక్తివంచనలేకుండా పనిచేస్తానని, ఎమ్మెల్యే కాసు ద్వారా ప్రభుత్వం నుంచి నిధులు సేకరిస్తానని ఆమె వెల్లడించారు. చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన సుబ్బమ్మ సాంబయ్య దంపతులను జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, వైస్‌చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, కార్మిక విభాగం పార్లమెంట్ అధ్యక్షుడు గద్దల వేదమణి, నాయకులు తిరుపతిరెడ్డి, కొప్పుల రవికుమార్, అంబటి ఆంజనేయులు, యర్రంశెట్టి సైదారావు, దాచేపల్లి సైదారావు, కొమ్ము బుజ్జి, మునగా శ్రీనివాసరావు, కొమ్మా కరుణకర్, కొత్వాల్ సైదా, షేక్ డాడీ, అక్కినపల్లి శ్రీనివాస్ సన్మానించారు.

ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా హరికృష్ణనాయక్



దాచేపల్లి : వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ మండలశాఖ అధ్యక్షుడిగా భట్రుపాలెంకు చెందిన భూక్యా హరికృష్ణనాయక్‌ను నియమితులైయ్యారని మండల కన్వీనర్ కోట కృష్ణ తెలిపారు. ఈ మేరకు దాచేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాసు చేతుల మీదుగా నియమక పత్రంను హరికృష్ణనాయక్‌కు శనివారం అందజేశారు. భట్రుపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా భూక్యా పాపారావు నాయక్, యువజన విభాగం అధ్యక్షుడిగా బాణావత రవినాయక్‌లను కూడా నియమించి పత్రాలు అందజేశామని కన్వీనర్ కృష్ణ చెప్పారు. ఎమ్మెల్యే కాసుతో పాటుగా సర్పంచ్ భూక్యా కొండనాయక్, ఎంపీటీసీ రెడ్యానాయక్, ఉపసర్పంచ్ బాణావత్ జగదీష్‌నాయక్, సచివాలయం కన్వీనర్ భూక్యా వెంకటేశ్వర్లు నాయక్, భూక్యా కల్యాణ్‌నాయక్, పిచ్చనాయక్, కోటినాయక్, హరికృష్ణనాయక్, పాపారావు నాయక్, రవి నాయక్‌ను సన్మానించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

గురజాల : ఈనెల 11వ తేదీన కోర్టు భవనంలో మండల న్యాయసేవాదికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 10వ అదనపు జిల్లా జడ్జి జి వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కోర్టులో శనివారం మాట్లాడుతూ అదాలత్‌లో రాజీ పడదగిన మరియు క్రిమినల్ మరియు సివిల్ కేసులు, బ్యాంకు పెండింగ్ కేసులుతో పాటు మోటారు వాహన ప్రమాదంకు సంబంధించిన కేసులు సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి లీలా వెంకట శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి ఏ మంజులతా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంగర హరిసత్యనారాయణ, ఏపీపీ బారెడ్డి నాగిరెడ్డి, న్యాయవాదులు ప్రభుదాసు, జానీబాషా, చెన్నకేశవరావు, లింగరాజు, చాగంటి సురేష్ తదితరులున్నారు.

పేద ముస్లింకు ఆర్థిక సాయం

పిడుగురాళ్ల: మాచవరం మండలంలోని రేగులగడ్డ గ్రామానికి చెందిన ఇమామ్‌గా పని చేస్తున్న మాబుకు రూ. 3 వేల ఆర్థిక సాయాన్ని చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాసరావు, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అందించారు. ఈసందర్భంగా డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ మాట్లాడుతూ... గురజాల నియోజకవర్గంలో ఎవరు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నా చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టుకు తెలిస్తే వెంటనే సహాయం చేస్తామని ఆయన తెలియజేశారు. చింతలపూడి ట్రస్టు చైర్మన్ చింతలపూడి శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా ప్రతి నెల రూ. 3 వేలను మాబుకు ఆర్థిక సహాయంగా అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చింతలపూటి బాబు, ట్రస్టు సభ్యులు తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



బద్దూరి బ్రహ్మారెడ్డికి నియామక పత్రాన్ని అందచేస్తున్న ప్రభుత్వ విప్, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: మండల పరిధిలోని సత్రశాల వద్ద వేంచేసిన ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా జరిపించేందుకు కృషి చేయాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన బద్దూరి బ్రహ్మారెడ్డిని సత్రశాల మల్లిఖార్జున స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ హరి జవహర్ ఉత్తర్వులు జారీ చేయగా నియామక పత్రాన్ని బ్రహ్మారెడ్డికి పీఆర్కే అందచేసి మాట్లాడారు. శివభక్తునిగా పేరు పొందిన బ్రహ్మారెడ్డికి ఎంతో పురాతనమైన శైవక్షేత్రంగా పేరు పొందిన సత్రశాల మల్లిఖార్జునస్వామికి సేవ చేయడానికి చైర్మన్‌గా నయామకం జరగడం సంతోషకరమన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖాధికారులు, గ్రామాలలోని పెద్దల సూచనలు, సలహాలతో సమిష్టిగా కృషి చేసి మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పూజల రామయ్య, పార్టీ రాష్ట్ర యువజన కార్యవర్గ సభ్యులు మోర్తల ఉమ, పార్టీ నాయకులు చల్లా మట్టారెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, పమ్మి సీతారామిరెడ్డి, కుందురు పేర్‌రెడ్డి, మద్దికర వెంకటేశ్వరరెడ్డి, అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ తదితరులున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీరాజ్ అధికారి భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీరాజ్ అధికారి భాస్కర్‌రెడ్డి

రెంటచింతల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికి అందించడంతో పాటు గ్రామాల్లో మెరుగైన సేవలు అందించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి మల్లవరపు భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వివిధ శాఖాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు ఆయా శాఖాధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పుడు వెంటనే స్పందించి ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇళ్లు లేని పేదలకు మంజూరు చేసి పంపిణీ చేసిన ఇళ్లను త్వరగా నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు నిధులు ఉచితంగా ఇస్తుందన్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో మ్యాపింగ్ చేస్తున్నట్లు ఈ నెల 5వ తేదీ సాయంత్రానికి 100 శాతం మ్యాపింగ్ చేయాలని సూచించారు. మండలంలోని 11 గ్రామాల్లో మొత్తం 14 లేఅవుట్లు వేసి 2,232 మంది లబ్ధిదారులకు ఎంపిక చేసి ఇళ్లపట్టాలను ఇవ్వడం జరిగిందని హౌసింగ్ ఏఈ సి.శ్రీనివాసరావు ప్రత్యేక అధికారికి వివరించారు. ఇప్పటి వరకు 1826 లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8 మంది సిబ్బందితో సచివాలయాలను ఏర్పాటు చేశారని అధికారులు తరచుగా సచివాలయాలను సందర్శించి ఉద్యోగుల పని తీరును, ప్రజలకు వారు చేస్తున్న సేవల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ గౌసియాబేగం, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఎంఈఓ ఐ.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, వెలుగు ఏపీఎం ఎం. చినబాబు, అంగన్వాడీ సూపర్ వైజర్ మహాలక్ష్మమ్మ తదితరులున్నారు.

చివరి భూములకు సాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : తంగెడ మేజర్ కాలువ పరిధిలోని చివర భూములకు సాగునీరు అందిస్తామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాసు మాట్లాడారు. తంగెడ గ్రామ సమీపంలో కృష్ణానది సమీపంలో ఎత్తిపోతల పథకం నిర్మించి మేజర్ కాలువ పరిధిలోని చివర భూములకు సాగునీరు అందించి రైతన్నల కష్టాలు తీరుస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ ద్వారా రూ. 300 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించే ఎత్తిపోతల పథకాలతో తంగెడ, ఆకురాజుపల్లి, రామారావు, గొట్టిముక్కల మేజర్ల కింద సూమారుగా 40 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి సంబంధించి డిజిపిఎస్ సర్వే చేసేందుకు ప్రభుత్వం రూ. 50 లక్షల నిధులు మంజూరు చేసిందని, మొదటి విడతగా తంగెడ వద్ద ఈ సర్వేను అధికారులు చేపట్టారని ఆయన తెలిపారు. ఎత్తిపోతలకు సంబంధించి ఉన్న ఇబ్బందులను సీఎం జగన్ సహకారంతో అధిగమిస్తామని, కృష్ణానది ఉన్నంత కాలం ఎత్తిపోతల పథకాల ద్వారా భూములకు సాగునీరు అందుతాయని ఎమ్మెల్యే కాసు చెప్పారు.

ఇచ్చిన హామీలు నేరవేరుస్తున్నాం...

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు ప్రధాన హామీల్లో ఐదింటిని నేరవేర్చామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. దాచేపల్లి, గురజాలను నగర పంచాయతీలుగా చేయడం, బుగ్గవాగు వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీరు అందించే కార్యక్రమం చేపట్టామని, పిడుగురాళ్ల బైపాస్ రోడ్డును ఏప్రిల్‌లో పూర్తి చేసి ప్రజలకు అంకితమిచ్చి అదే రోజు జానపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిధిలో రూ. 250 కోట్లతో తాగునీటి పథకాలు చేపట్టుతున్నామని, ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆగస్టులో ప్రారంభిస్తామని ఆయన తెలియజేశారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ బ్రహ్మానాయుడు, వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెద హనిమిరెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, సోసైటి అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, నాయకులు కొలా జంపాలరెడ్డి, దాచేపల్లి సైదారావు, కుందురు తిరుపతిరెడ్డి, కొప్పుల రవి కుమార్, భూక్యా కల్యాణ్‌నాయక్, ఉల్లేరు హనుమంతరావు, నెల్లూరి కోటేశ్వరరావు తదితరులున్నారు.

మోర్జంపాడులో ముగిసిన ఎడ్ల పందేలు



సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన కేసానుపల్లి ఎద్దు

మాచవరం: మోర్జంపాడులో శ్రీలక్ష్మి నరసింహా స్వామి 67వ కల్యాణ మహోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శన బండ లాగుడు పోటీల్లో సీనియర్ (జాక్‌పాట్) విభాగంలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎద్దు 2600 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచి, రూ.70 వేలు నగదు బహుమతిని అందుకున్నాయి. రెండవ స్థానంలో దప్పిలి అంజిరెడ్డి (శ్రీనివాస్‌నగర్, పిడుగురాళ్ల) ఎద్దు 2000 అడుగులు లాగి, రూ.60 వేలు నగదు బహుమతిని అందుకున్నాయి. మూడో స్థానంలో నెల్లూరి రామకోటయ్య (కేసానుపల్లి, దాచేపల్లి మండలం) 1834.5 అడుగులు లాగి, రూ.50 వేలు నగదును బహుమతిని గెలుచుకున్నాయి. పావులూరి వీరాస్వామి చౌదరి (బల్లికురవ, బాపట్ల) ఎడ్ల జత 1500.5 అడుగులు, మొక్కపాటి రామారావు చౌదరి (మాచవరం మండలం, పల్నాడు జిల్లా) ఎద్దు 1402.8 అడుగులు, గానుగపంట రాజశేఖర్‌రెడ్డి (దర్శి, ప్రకాశం జిల్లా) ఎద్దు 1400 అడుగులు లాగి వరుస స్థానాల్లో నిలిచాయి. వీరికి నిర్వాహకులు నగదు బహుమతులు అందజేసారు.


జూనియర్ విభాగంలో...

జూనియర్ విభాగంలో మేకా కృష్ణమోహన్ (ఘంటశాల, విజయవాడ), పోపూరి శ్రీనివాసరావు (మార్టూరు, బాపట్ల జిల్లా) కంబైన్డ్ ఎడ్ల జత 2923 అడుగులు దూరాన్ని లాగి మొదటి స్థానం దక్కించుకున్నాయి. రెండో స్థానంలో యల్లం సాంబశివరావు (లింగాయపాలెం, గుంటూరు) ఎద్దు 2800 అడుగులు లాగాయి. కాకర్ల సురేష్‌బాబు (నాదెండ్లవారిపాలెం, చల్లపల్లి, కృష్ణా జిల్లా) ఎద్దు 2639 అడుగులు, పోపూరి శ్రీనివాసరావు (మార్టూరు, బాపట్ల జిల్లా), మేకా కృష్ణమోహన్ (ఘంటశాల, విజయవాడ), కంబైన్డ్ ఎడ్ల జత 2207.3 అడుగులు, పులి వెంకటరెడ్డి (మండాది, వెల్దుర్తి మండలం, పల్నాడు జిల్లా) ఎద్దు 2151 అడుగులు, పోట్లూరి హరినీయ చౌదరి (విద్యానగర్, గుంటూరు) ఎద్దు 1437.8 అడుగులు, చిరుమామిళ్ల ఏడుకొండలు (కుందుర్తి, సంతమావులూరు, ప్రకాశం జిల్లా) 1200 అడుగుల దూరాన్ని లాగి వరుస స్థానాల్లో నిలిచాయి. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేసారు. ఈ పోటీలకు వ్యాఖ్యాతలుగా పెనుమచ్చ రాధాకృష్ణ, దుగ్గి శ్రీనివాసరావులు వ్యవహరించారు. పోటీలకు సహకరించి, కార్యక్రమాలకు పలు గ్రామాల నుంచి విచ్చేసిన రైతులకు శ్రీలక్ష్మి నరసింహా స్వామి రైతు సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయం

దుర్గి: మాచర్ల నియోజక వర్గంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ శనివారం ఆయనను మాచర్ల కెసిపి గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంత్రి ఆదిమూలపు సురేష్‌కు మార్కెట్ యార్డును చైర్మన్‌ను పరిచయం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతానికి మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఆహ్వానించి నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంపై మంత్రికి ప్రభుత్వ విప్ పీఆర్కేకి ఇరువురికి అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు వారి నేతృత్వంలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శర్మ, ముటుకూరు ఎంపీటిసి పసుపులేటి వెంకటరామయ్య, ఎస్ఎంసి చైర్మన్ తోటకూరు వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు ఉన్నారు.

నష్టం జరిగిన మిర్చి పంటలను పరిశీలించిన అధికారులు



మిర్చి పంటను క్షేత్ర పరిశీలన చేస్తున్న అధికారులు

కారెంపూడి : కారెంపూడి తండా రైతులు వేసి నష్టపోయిన మిర్చి పంటలను ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. వేసిన మిర్చి పంట కాయక అప్పుల పాలయ్యామని పేర్కొంటూ తండా రైతులు రమావతు రామచంద్రా నాయక్, హనుమానాయక్, లచ్చానాయక్‌లు ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండ వచ్చిన సందర్భంలో సీఎంకు వినతి పత్రం అందించడంతో పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు విచారణ నిర్వహించారు. రైతులు వేసిన విత్తనం, పంట వేసిన దగ్గర నుంచి వేసిన రసాయనిక ఎరువులు, సేంద్రియ ఎరువులు, పిచికారీ చేసిన పురుగు మందులు చేసిన అంతర సేద్యం సాగు వివరాలను అధికారులు రైతులను అడిగి నమోదు చేసుకున్నారు. తాము హంస తేజ రకం మిర్చి విత్తనాలను కారెంపూడిలోని విశ్వనాథా సీడ్స్ నుంచి కొనుగోలు చేశామని ఇప్పటికి ఎకరాకు లక్షన్నర దాకా పెట్టుబడి అయ్యిందని తొలి కాపు కోసినా ఎకరాకు క్వింటా కూడా దిగుబడి రాలేదని ఇప్పుడు పంట కాసే పరిస్థితి కూడా కన్పించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని విచారించి న్యాయం చేయాలని రైతులు వేడుకున్నారు. గురజాల ఉద్యానవన శాఖ అధికారి మోహన్, సీనియర్ శాస్త్రవేత్త ఆర్ నాగలక్ష్మి, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ యలమందారెడ్డి వ్యవసాయ శాఖ సిబ్బంది పంటలను పరిశీలించారు. నివేదికను పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటికి ఇస్తామని అధికారులు వెల్లడించారు.